క్లుప్తంగా

నేడు ఆడారి ఆనంద్‌కుమార్ పర్యటన

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ శనివారం 58, 60, 62 వార్డుల్లో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఉదయం 9 గంటలకు 60వ వార్డు శ్రీహరిపురం వద్ద బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా జరిగే పూజా కార్యక్రమానికి హాజరవుతారు. సాయంత్రం 5 గంటలకు 58వ వార్డు కుంచిమాంబ, నీలమాంబ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో పిలకవానిపాలెం క్రీడా మైదానంలో నిర్వహించే క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 7 గంటలకు 62వ వార్డు త్రినాథ్‌పురంలో శివరాత్రి సందర్భంగా జరిగే పరసలో పాల్గొంటారు. ఆయా కార్యక్రమాలకు ఆయా వార్డుల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు హాజరు కానున్నారు.

కరాటే విజేతలకు కార్పొరేటర్ ప్రశంస



కరాటే విజేతలతో కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రాంతానికి చెందిన పలువురు ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. వీరిలో వంశీవర్ధన్,తేజస్‌లకు గోల్డ్ మెడల్ రాగా, కృతికి సిల్వర్ మెడల్ వచ్చింది.రిషిస్‌కు బ్రాంజ్ మెడల్ వచ్చింది. ఆర్‌కేపురంలోని కార్పొరేటర్ నివాసం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ సుధ విజేతలను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాడి సత్యనారాయణ,కొల్లి నూకరెడ్డి,స్వప్న,చట్టి నూకరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ శుక్రవారం తెలిపారు. అర్థశాస్త్రం సబ్జెక్టు ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై నెట్/స్లెట్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు విద్యా అర్హత, బోధన అనుభవానికి సంబంధించి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు జెరాక్స్ సెట్‌తో డెమో క్లాస్‌నిర్వహించడానికి ఈ నెల 20న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు అభినందనలు



ఉద్యోగులను అభినందిస్తున్న షిప్‌యార్డ్ డైరెక్టర్ గుప్తా

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ మానవ వనరుల విభాగానికి ఉత్తమ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో జరిగిన 9వ పబ్లిక్ సెక్టార్ విభాగం అవార్డుల ఉత్సవంలో ఈ అవార్డును షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రీ అందుకున్నారు. అధికారుల నియామకం, బదిలీల విషయాల్లో పారదర్శకంగా నిర్వహించినందుకు గానూ ఈ అవార్డు బహూకరించారు. ఈ సందర్భంగా శనివారం సంస్థ ఆవరణలో హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులను షిప్‌యార్డ్ డైరెక్టర్, కార్పొరేట్ ప్లానింగ్ అధికారి జె.పి.గుప్తా అభినందించారు.

ఆర్టీసీ స్టీల్‌సిటీ అధికారుల వైఖరిపై ఫిర్యాదు

మద్దిలపాలెం: ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపో మేనేజర్, చీఫ్ ఇన్‌స్పెక్టర్‌ల నిరంకుశ వైఖరిపై సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఇద్దరి అధికారులపై విజయవాడలోని ఎండీని కలిసి ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు. వీరిపై గతేడాది కూడా పలుమార్లు ఫిర్యాదు చేశామని వివరించారు.

శివపూజకు వేళాయె



మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన ఎన్‌ఏడీ జంక్షన్‌లోని శివాలయం

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ పరిసర ప్రాంతాల్లో శివాలయాలు శివరాత్రి పూజలకు ముస్తాబయ్యాయి. ఎన్ఏడీ శివాలయం, కాకానినగర్, కరాసా, సీతారామరాజునగర్, గోపాలపట్నం, కొత్తపాలెం, వెంకటాపురంలోని శివాలయాల్లో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయాల నిర్వాహకులు పేర్కొన్నారు. ఎన్ఏడీలోని ప్రథమ ఉమా లిగేశ్వరాలయంలో ఇటీవల ప్రతిష్ఠించిన ధ్వజస్తంభాన్ని ఇత్తడి తాపడం ఏర్పాటు చేశారు. కాకానినగర్ శివాలయంలో లింగోద్భవ సమయంలో మహాన్యసపూర్వక సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు సత్తెప్ప తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి క్షీరాభిషేకాలు, శని త్రయోదశి కావడంతో తైలాభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆలయాలు ముస్తాబు

మల్కాపురం: మహాశివరాత్రి,మాస శివరాత్రి,శనిత్రయోదశి పర్వదినాలు శనివారం రోజే రావడంతో శివరాత్రి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం పారిశ్రామిక ప్రాంతంలోని శివాలయాల్లో శనివారం శివరాత్రి పూజలకు పలు ఏర్పాట్లు చేశారు. స్థానిక ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత సోమశేఖరస్వామి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు.



పుష్పాలంకరణలో చింతామణి దుర్గాగణపతి ఆలయం

- 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని హరహర క్షేత్రంలో కొలువుదీరిన శివుని మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.
- 59వ వార్డు గణపతినగర్‌లో కొలువుదీరిన పసుపతినాథ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం నుంచి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

గోపాలపట్నం రైతుబజారులో ఆర్గానిక్ స్టాల్



గోపాలపట్నం రైతుబజారు ఆవరణలో ఏర్పాటు చేసిన రైతుమిత్ర దుకాణం



దుకాణంలో ఉంచిన పలు రకాల ఉత్పత్తులు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో రైతు మిత్ర దుకాణం వినియోగదారులకు అందుబాటులోకి వచ్చింది. ఈ దుకాణంలో సేంద్రియ ఉత్పత్తులనుఅందుబాటులో ఉంచారు. కిరాణా సామగ్రితో పాటు ఆకు కూరలు, పలు రకాల బియ్యం ఉత్పత్తులు, మిల్లెట్స్ ఇక్కడ దొరుకుతున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు.

రహదారుల్లో డెబ్రిస్ తొలగింపు



కంచరపాలెం మలుపు వద్ద పొక్లెయిన్‌తో డెబ్రిస్‌ను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే రహదారుల్లో ఇష్టానుసారంగా డంప్‌చేసిన డెబ్రిస్‌ను శనివారం తొలగించారు. ఇక్కడ రహదారికి ఇరువైపులా పడవేసిన భవన నిర్మాణ వ్యర్థాలు, పశు కలేబరాలతో స్థానికులు, పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యపై 'డంపింగ్ యార్డుల్లా రహదారులు' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో వెలువడిన కథనానికి జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తక్షణం స్పందించారు. ఈమేరకు పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ జనార్దన్‌ల పర్యవేక్షణలో శానిటరీ సిబ్బంది పొక్లెయిన్‌తో డెబ్రిస్‌ను తొలగించి తరలించారు. రహదారులపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, డంపింగ్‌కు వినియోగించిన వాహనాలను సీజ్ చేస్తామని జెడ్సీ కృష్ణ హెచ్చరించారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ అంబేడ్కర్ నగర్ వద్ద జాతీయ రహదారి గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. వీటిని బాగు చేస్తే అనేక మందికి ఉపయోగకరంగా ఉంటాయని స్థానికులు కోరుతున్నారు. కొన్ని ఏళ్లుగా ఇవి మరమ్మతులకు గురికావడంతో వినియోగంలో లేకుండా పోయాయి. దీంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి పరిసర ప్రాంతంలో గాజువాకకు వెళ్లే బస్‌స్టాప్ వద్ద సమీపంలో, గోపాలపట్నం వెళ్లే దారిలో ఆల్ఫా హోటల్ వద్ద మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతంలోని మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



అంబేడ్కర్ నగర్ వద్ద హైవేలో వినియోగంలో లేని మరుగుదొడ్లు

ఎన్ఎస్‌టీఎల్‌లో వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీరావు. చిత్రంలో ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గోపాలపట్నం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా కల్యాణ మంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, మహిళా కల్యాణ మంచ్ చైర్‌పర్సన్ వై.లక్ష్మీరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారన్నారు. దేశంలోని ప్రతి మహిళా స్వావలంబన కలిగి ఉండాలని సూచించారు. ఈ వైద్య శిబిరానికి నగరంలోని ఓమ్నీ ఆర్కే ఆస్పత్రి, అగర్వాల్ కంటి ఆస్పత్రుల ప్రతినిధులు సహకరించారని తెలిపారు. అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ జేమ్స్, ఎస్ఏ ఆడమ్స్ వైద్య పరీక్షలు చేశారు. మహిళలకు కంటి సమస్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఓమ్నీ ఆర్కే వైద్యులు డాక్టర్ సూర్య, సుజాత, ప్రదీప్‌కుమార్, నిహారిక వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కమిటీ సభ్యులు ఎం.సుజాత, ప్రేరణ ప్రియదర్శిని, కె.సునీత, ఎస్.చంద్రలక్ష్మి, శారద తదితరులు సహాయ సహకారాలు అందించారు. వైద్య శిబిరంలో 130 మంది మహిళలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

మానసిక ప్రశాంతతతో లక్ష్య సాధన

ఏయూ క్యాంపస్: మనిషికి మానసిక ప్రశాంతత ఉంటే లక్ష్య సాధన సులభమవుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సహజ యోగ ప్రదాత మాతాజీ నిర్మలాదేవి శత జయంత్యుత్సవాలు శుక్రవారం ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను వీసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో ప్రజలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. ఒత్తిళ్లను జయించేందుకు ప్రతి ఒక్కరు యోగా సాధన, ప్రాణాయామం చేయాలని సూచించారు. ఇటువంటి ఒత్తిడి లేని నాడే మానవుడు అనుకున్నది అత్యంత సులభంగా సాధించగలడని తెలిపారు. ఏయూ యోగా కేంద్రంలో ఎంఏ యోగా విద్యార్థులకు సహజ యోగాపై అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని వయస్సుల వారికి సహజ యోగా ఒక మానసిక శక్తిని అందించే సాధనంగా మారిందన్నారు. మాతాజీ నిర్మలాదేవి ప్రసాదించిన సహజ యోగ ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చునని చెప్పారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, సీనియర్ జర్నలిస్ట్ వి.వి. రమణమూర్తి మాట్లాడుతూ నిరంతరం సహజ యోగా చేయడం వల్ల ఒత్తిళ్లు దరి చేరవని తెలిపారు. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో వివిధ రాష్ట్రాల నుంచి సహజ యోగులు హాజరయ్యారు.



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

మర్రిపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్ దగ్గరలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున పలువురి సమాచారం మేరకు సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసున్న ఒక వ్యక్తి మృతదేహం పట్టాలపై ఉండటాన్ని గవర్నమెంట్ రైల్వే పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తి నీలం రంగు జీన్స్ ఫ్యాంట్, నీలం రంగుపై తెల్లని చుక్కలు ఉన్న ఫుల్ హ్యాండ్స్ చొక్కా వేసుకుని ఉన్నాడని, పారాగాన్ కంపెనీ చెప్పులు ధరించి, ముఖం గుర్తుపట్టలేని విధంగా చిట్లిపోయి ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని జీఆర్‌పీ ఎస్ఐ బాలకృష్ణ చెప్పారు.

ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య

విశాఖ విద్య: ఆర్జేడీ ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య అని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. గోపీనాథ్, ఎం. శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులు సరైన పద్ధతి కాదన్నారు. విద్యాశాఖ పనితీరు పురోగతికి ఆర్జేడీ ప్రతాపరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అలాంటి అధికారికి పీఆర్‌టీయూ అండగా నిలుస్తుందన్నారు.

నేవీ సిబ్బంది పుస్తక ప్రదర్శన



ప్రదర్శనలో పుస్తకాలు చూస్తున్న విద్యార్థులు

మర్రిపాలెం: భారతీయ నావికాదళ సిబ్బంది వారి కుటుంబాల్లో పుస్తక పఠనాన్ని అలవాటుగా పెంపొందించుకోవడం కోసం పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. 104 ఏరియాలోని కమ్యూనిటీ హాల్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఫిక్షన్, నాన్ ఫిక్షన్, బయోగ్రఫీలు, ఆత్మకథలు, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన వివిధ రకాల పుస్తకాలను ప్రదర్శనలో పొందుపరిచారు. అధ్యయనాలు, సముద్ర సంబంధిత, అకడమిక్ పుస్తకాలు మొదలైనవి ప్రదర్శించారు. నౌకాదళ సిబ్బంది, నేవీ చిల్డ్రన్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం–2 నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు కుటుంబాలతో కలిసి ప్రదర్శనను తిలకించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



చినముషిడివాడలో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ అశోక్, ఎస్ఐ రమేష్

సింహాచలం: ట్రాఫిక్ నింబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం సాగించాలని పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ వాహనదారులు, ప్రజలకు సూచించారు. చినముషిడివాడ సంత వద్ద శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు సుప్ర వెహికల్ ద్వారా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే తీరు, గతంలో జరిగిన ప్రమాదాల సంఘటనలను స్క్రీన్‌లో చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని తెలియజేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయడం ద్వారా సంభవించే ప్రమాదాలను వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో వైద్యనాథుడి దివ్య దర్శనం

బీచ్ రోడ్డు: మహా శివరాత్రి సందర్భంగా బీచ్ రోడ్డులోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రంలో పరమశివుడిని వైద్యునాథుడి రూపంలో ఏర్పాటు చేశారు. మూడు రోజు పాటు సాగనున్న ఈ మహోత్సవాలను గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ పి.సోమరాజు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధి శివలీల పాల్గొన్నారు.



శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న బ్రహ్మకుమారీలు, అతిథులు

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

సీఐ లూథర్‌బాబు

మల్కాపురం: సైబర్ నేరగాళ్లు కొత్త తరహా నేరాలు చేస్తున్నారని.. వారి పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని మల్కాపురం సీఐ లూథర్‌బాబు సూచించారు.సైబర్ నేరాలపై మల్కాపురం పల్లివీధి, జాతరవీధి,హరిజనవీధి సచివాలయాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తి గత ఫోన్లకు నేరగాళ్లు ఫోన్ చేసి ఓటీపీ నెంబర్ చెప్పమని, బ్యాంక్ అకౌంట్ చెప్పమని మెసేజ్‌లు పంపి నగదు ఆశ చూపుతారన్నారు. నగదు మాయలో పడి ఓటీపీ,అకౌంట్ నెంబర్ చెప్పితే బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బు మాయం అవుతుందన్నారు. అలాగే ఈఎంఐ లోన్లు,తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని నేరగాళ్లు మాయమాటలు చెప్పుతారని,వారి మాటలు నమ్మి బ్యాంక్ వివరాలు చెప్పితే చేతులారా తమ డబ్బులు వారికి అప్పజెప్పిన వారవుతారన్నారు. రుణాల విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే తక్షణం తనకు ఫోన్ చేయాలన్నారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు జీవితాన్ని చిత్తు చేస్తుందన్నారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి అమ్మినా,సేవిస్తున్నట్టు సమాచారం ఉన్నా తమకు ఫోన్ చేయాలని కోరారు. ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సచివాలయాల మహిళ పోలీసులు,సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో సీఐ లూథర్‌బాబు

అభివృద్ధి పనుల పరిశీలన

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులో శుక్రవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పర్యటించారు. సంజీవయ్య నగర్, అంబేడ్కర్ నగర్ జాతీయ రహదారి గ్రీన్‌బెల్ట్ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. సంజీవయ్య నగర్‌లో ఇటీవల గెడ్డ పూడికల పనులు చేపట్టారు. మరి కొన్ని చోట్ల పూడికలు ఉన్నాయని, వాటిని సైతం తొలగించాలని డిప్యూటీ మేయర్ సూచించారు. ఈ గెడ్డలో పందుల సంచారం ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పడంతో వెంటనే స్పందించిన ఆయన జీవీఎంసీ వెటర్నరీ అధికారులకు సమాచారమందించారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారిలో గ్రీన్‌బెల్ట్ ఆక్రమణలను తొలగించిన అనంతరం వాటి అభివృద్ధి పనులు చేపట్టిన వైనాన్ని పరిశీలించారు. గ్రీన్‌బెల్ట్‌లో ఫెన్సింగ్ మొక్కలు పెంచేందుకు మట్టి వేయడం, ఎండిన కొమ్మలను తొలగించడం వంటి పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రీన్‌బెల్ట్‌లో వ్యర్థాలను తొలగించి ఆహ్లాదరకమైన మొక్కలు నాటాలని అధికారులకు శ్రీధర్ సూచించారు. శానటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌బెల్ట్‌లో పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

మూఢనమ్మకాలపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్ తదితరులు

మల్కాపురం: మూఢనమ్మకాల వల్ల విలువైన జీవన విధానాన్ని పలువురు నాశనం చేసుకుంటున్నారని ప్రముఖ డయోబెటాలజిస్ట్ డాక్టర్ రామేష్ అన్నారు. 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ స్కూల్ ఆధ్వర్యంలో సత్యాన్వేషణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మూఢనమ్మకాలను విడనాడాలని విద్యార్థులతో కలిసి ఆయన పిలకవానిపాలెం నుంచి శ్రీహరిపురం వరకు చేపట్టిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. మూఢనమ్మకం మానవుని పురోగతికి సంకెళ్లు వేస్తుందన్నారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధి గోపాలరావు మూఢనమ్మకాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.వాసుదేవరావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐ పరీక్షలకు సన్నాహాలు

- పరీక్షా కేంద్రాల్లో 144 సెక్షన్ విధింపు
- ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

గోపాలపట్నం: ఈ నెల 19న ఎస్ఐ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్టు వెస్ట్‌సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి పేపర్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

పరీక్షా కేంద్రాలు

1. జ్ఞానాపురం సెంట్ జోసెఫ్ మహిళా కళాశాల
2. ఊర్వశి జంక్షన్ శ్రీ గౌరి డిగ్రి, పీజి కళాశాల
3. 5వ పట్టణ పోలీస్ స్టేషన్ సమీప ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్
4. ఎన్ఏడీ జంక్షన్ సమీప బుచ్చిరాజుపాలెం సెయింటాన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల
5. బుచ్చిరాజుపాలెం భాష్యం పాఠశాల,
6. గోపాలపట్నం ఆదిత్య డిగ్రీ కళాశాల
7. గోపాలపట్నం బాలాజీ గార్డెన్లోని బాలాజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల వరకు ఎవరూ గుమి గూడి ఉండకూడదని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అంతా సహకరించాలని కోరారు.

వాల్తేర్ డివిజన్‌లో రైల్వే జీఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా మనోజ్ శర్మ వాల్తేర్ డివిజన్ పరిధి పలాస–విశాఖపట్నం సెక్షన్‌లో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి శుక్రవారం విండో ఇన్‌స్పెక్షన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పలాస–విశాఖపట్నం సెక్షన్‌లోని ట్రాక్స్, మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్, సిగ్నలింగ్, పలు భద్రతా విషయాలను పరిశీలించారు. జీఎం, డీఆర్‌ఎంల తోపాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన వివిధ విభాగాల ప్రిన్సిపల్ హెడ్స్, వాల్తేర్ డివిజన్‌కు చెందిన బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

వివిధ విభాగాధిపతులతో సమావేశం..

జీఎం మనోజ్ శర్మ విశాఖ చేరుకున్న తరువాత డీఆర్‌ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, డివిజన్ పనితీరు, అవలంబిస్తున్న భద్రతా ప్రమాణాలు, అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీఎంకు డీఆర్‌ఎం సత్పతి వివరించారు. యూనియన్ నాయకులు డీఆర్‌ఎం కార్యాలయంలో మనోజ్ శర్మకు స్వాగతం పలికారు.



డివిజన్ కార్యకలాపాలు, పనితీరును జీఎం మనోజ్ శర్మకు వివరిస్తున్న డీఆర్‌ఎం సత్పతి